సాక్షి
శ్రీకాకుళం
బుధవారం । 1 । ఫిబ్రవరి । 2023



అనగనగా.. ఉద్దానం మునగ

ఉద్దానం మునగకు డిమాండ్ పెరుగుతోంది. ఉత్తరాదికి కూడా ఎగుమతి అవుతోంది.

- 8లో



ఉగాదికి గృహ ప్రవేశాలు

జగనన్న ఇళ్లకు ఉగాది నాటికి గృహ ప్రవేశాలు జరగనున్నాయి. అధికారులు పనులు ముమ్మరం చేస్తున్నారు. - 8లో

నేటితో ముగియనున్న జేఈఈ మెయిన్స్

ఎచ్చెర్ల క్యాంపస్: జిల్లాలో రెండు కేంద్రాల్లో కొనసాగుతున్న జేఈఈ మెయిన్స్ బుధవారంతో ముగియనున్నాయి. జిల్లాలో చిలకపాలెంలోని శ్రీశివానీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్, ఎచ్చెర్లలోని శ్రీ వెంకటేశ్వర ఇంజినీరింగ్ కాలేజీల్లో పరీక్షలు జరిగాయి. ప్రస్తుతం ఒకే పరీక్ష కేంద్రం శ్రీ వెంకటేశ్వరలో జరుగుతున్నాయి. రెండు షిఫ్టుల్లో మంగళవారం పరీక్షలు జరగ్గా, మొదటి షిఫ్టులో 100కి 99 మంది హాజరు కాగా, ఒక్కరు గైర్హాజరయ్యారు. రెండో షిఫ్టులో 100కి 100 మంది హాజరయ్యారు.

న్యూస్‌రీల్

జాతీయ స్థాయి మానిటరింగ్ కమిటీ రాక రేపు

శ్రీకాకుళం పాతబస్టాండ్: మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం పనులు పర్యవేక్షించేందుకు జాతీయ స్థాయి మానిటరింగ్ కమిటీ గురువారం జిల్లాలో పర్యటించనుంది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రిత్వ శాఖ లేఖ పంపింది. ఈ కమిటీ ప్రధానంగా లేబర్ బడ్జెట్, వంద రోజుల పని దినాలు, సగటు వేతనం గిట్టుబాటు, కొత్త జాబ్ కార్డులు మంజూరు వంటి అంశాలు పరిశీలించనుంది.

'క్రిమినల్ కేసుల్లో పరిహారం చెల్లించాలి'



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా

శ్రీకాకుళం పాతబస్టాండ్: క్రిమినల్ కేసుల్లో బాధితులకు నష్టపరిహారం త్వరితగతిన చెల్లించాలని, వారికి ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ అధ్యక్షుడు జునైద్ అహ్మద్ మౌలానా అన్నారు. క్రిమినల్ కేసుల పరిహారంపై ఆయన కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్, ఎస్పీ జీఆర్ రాధికలతో కలిసి కోర్టు హాల్‌లో మంగళవారం సమావేశం నిర్వహించారు. క్రిమినల్ కేసుల్లో బాధితులు ముఖ్యంగా స్త్రీలు, బాలికల విషయంలో పరిహారం చెల్లింపు విషయమై తీసుకున్న నిర్ణయాలపై చర్చించారు.

నేడు వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయ భవన శంకుస్థాపన



సైట్ ఇంజినీర్‌కు సూచనలు ఇస్తున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ) : శ్రీకాకుళం నగరం పెద్దపాడు సమీపంలో జాతీయ రహదారిని ఆనుకొని ఉన్న వరుణ్ మోటార్స్ వెనుక వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయ భవన నిర్మాణానికి బుధవారం శంకుస్థాపన చేయనున్నట్లు పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణదాసు తెలిపారు. జిల్లాలోని ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలంతా హాజరు కావాలని కోరారు. కార్యాలయ నిర్మాణం జరిగే స్థలాన్ని పరిశీలించాక సైట్ ఇంజినీర్‌కు పలు సూచనలు చేశారు. శంకుస్థాపన అనంతరం పార్టీ ముఖ్యులతో సమావేశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో కార్పొరేషన్ల చైర్మన్లు మామిడి శ్రీకాంత్, అంధవరపు సూరిబాబు, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ శిమ్మ రాజశేఖర్, నల్లా దేవరాజ్, మెంటాడ స్వరూప్, ఎన్ని ధనుంజయరావు, సూర శ్రీనివాసరావు, మహ్మద్ సిరాజుద్దీన్, బొబ్బాది ఈశ్వర్రావు, నల్లబారిక శ్రీను, కనపల తేజ పాల్గొన్నారు.

లోకేష్ పొర్లుదండాలు పెట్టినా లాభం లేదు



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు

వజ్రపుకొత్తూరు: పేద ప్రజలకు మేలు జరుగుతుంటే చంద్రబాబు ఓర్వలేరని, ఆయన గతమంతా నయవంచనేనని మంత్రి సీదిరి అప్పలరాజు అన్నారు. వజ్రపుకొత్తూరు మండలం కొండవూరు గ్రామంలో మంగళవారం సర్పంచ్ కొల్లి భాస్కరరావు అధ్యక్షతన జరిగిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొని ఆయన మాట్లాడారు. నారా లోకేష్ పాదయాత్రే కాదు.. 4 లక్షల కిలోమీటర్లు పొర్లుదండాలు పెట్టినా అసెంబ్లీకి చేరలేడని, దమ్ముంటే పలాసలో తనపై పోటీ చేసి గెలవాలని సవాల్ విసిరారు. పేదలంతా జగన్ పక్షాన నిలబడి అండదండలు అందిస్తుంటే టీడీపీ నేతలు గగ్గోలు పెడుతున్నారని ధ్వజమెత్తారు. 2014లో అక్క చెల్లెమ్మలకు డ్వాక్రా రుణమాఫీ అని చెప్పి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు నాయుడు మాట మార్చారని గుర్తు చేశారు. ఆయనకు మహిళలంటే చులకన భావమని, వారిని మోసం చేసిన ఘన చరిత్ర మూటగట్టుకున్నాడని దుయ్యబట్టారు.



జజ్జనకరి జాతర..

విద్యుత్ వెలుగుల మధ్య కమ్మసిగడాం వెలిగిపోయింది. ధగధగలాడే అలంకరణలు, ఇసుకేస్తే రాలనంతగా జనాలు, విదేశాల నుంచి పర్యాటకులు వెరసి మహాలక్ష్మి తల్లి జాతర మంగళవారం రాత్రి అదరహో అనేలా జరిగింది. ఓ వైపు తల్లికి అర్చనలు జరుగుతుండగా.. మరోవైపు ఉత్సవంలో జనం ఉత్సాహంగా పాల్గొన్నారు. – రణస్థలం





ఆ'పాల'గోపాలం అబ్బురపడేలా..

శాలిహుండం కాళీయ మర్దన వేణుగోపాలుడు పాలధారల మధ్య కనువిందు చేశాడు. భీష్మ ఏకాదశి సందర్భంగా మంగళవారం అర్ధరాత్రి వేణుగోపాలునికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఆలయ ట్రస్టీ సుగ్గు మధురెడ్డి దంపతులు పట్టువస్త్రాలు, పూజాసామగ్రిని స్వామికి సమర్పించారు. అర్చకులు మహేంద్రాడు వేణుగోపాలచార్యులు ప్రత్యేక పూజలనంతరం క్షీరాభిషేకం నిర్వహించారు. అనంతరం భక్తులు స్వామిని దర్శించుకున్నారు. – గార

పోరాటాల శృతిలో..

జీవన సరిగమలు

- అనుకున్న లక్ష్యం కోసం అలుపెరగని పోరాటం
- సంగీత దర్శకుడిగా స్థిరపడిన సిక్కోలు యువకుడు
- చేతి నిండా సినిమాలతో బిజీగా సత్య కాశ్యప్

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం: స్వర జతులు ఆయన గతులను మార్చాయి. సరిగమలు బతుకులో మధురిమలు పలికించాయి. ఇష్టమైన సంగీతం నేర్చుకోవడానికి అన్ని అవరోధాలనూ ఆయన దాటారు. లక్ష్యం కోసం ఎంతగానో శ్రమించారు. ఆర్థిక కష్టాలను అధిగమించి ముందుకు సాగారు. సంగీతం నేర్చుకోవాలన్న తపనతో హైదరాబాద్ వెళ్లారు. సంగీత దర్శకుడిగా రాణించాలన్న పట్టుదలతో అవకాశాల కోసం ప్రయత్నాలు ప్రారంభించారు. అనుకున్న విధంగానే అవకాశాలను అందిపుచ్చుకుని, సంగీత దర్శకుడిగా రాణిస్తున్నారు. మన జిల్లాలోని ఆమదాలవలస మండలం కొర్లకోట గ్రామానికి చెందిన సత్య కాశ్యప్ అంచెలంచెలుగా రాణిస్తున్నారు. ఇటీవల గ్రామానికొచ్చిన సత్య కాశ్యప్ 'సాక్షి' ప్రతినిధితో పంచుకున్న ఇంటర్వ్యూ విశేషాలు ఆయన మాటల్లోనే..

లక్ష్యం కోసం హైదరాబాద్‌కు..

మాది కొర్లకోట గ్రామం. నా పూర్తి పేరు ఎన్ని సత్యనారాయణ(సత్య కాశ్యప్). సత్య అని ఊరిలో పిలుస్తారు. మా తల్లిదండ్రులు ఎన్ని గోపాలం, శాంతమ్మ. నలుగురు అన్నదమ్ములు, ఇద్దరు అక్కాచెల్లెళ్లు. ఆరుగురి సంతానంలో నేను చివరి వాడిని. చిన్నప్పుడు మా ఊరి రామాలయంలో జరిగిన భజన పాటలు నన్ను సంగీతంవైపు మళ్లేలా చేశాయి. కాకపోతే ఆర్థిక ఇబ్బందులు ఎదురయ్యాయి. ఇంటి దగ్గర పోషించి, చదివించే పరిస్థితి లేదు. దీంతో హైదరాబాద్ వెళ్లాను. మా అన్నయ్య రొయ్యల వ్యాపారంలో హెల్పర్‌గా పని చేశాను. వచ్చిన కొద్దిపాటి ఆదాయంతో అక్కడ ఇంటర్ పూర్తి చేశాను. అనంతరం నా లక్ష్యమైన సంగీతంలో తర్ఫీదు పొందేందుకు ప్రయత్నించాను. త్యాగరాజ కాలేజీలో హిందుస్థానీ క్లాసికల్ మ్యూజిక్‌లో ఆరేళ్లు డిప్లమో చేశాను. అదే సమయంలో డిస్టెన్స్ ఎడ్యుకేషన్‌లో డిగ్రీ చేశాను. ఇదే సందర్భంలో మ్యూజిక్ క్లాసులు చెప్పేవాడ్ని. దీంతో ఆర్థిక ఇబ్బందులు తీరేవి.



సంగీత దర్శకుడు సత్య కాశ్యప్

డిప్లమో పూర్తయ్యాక..

డిప్లమో పూర్తి చేశాక పలువురి వద్ద అసిస్టెంట్‌గా పని చేశాను. తర్వాత సినిమా ఆఫర్ వచ్చింది. పుత్రుడు సినిమాతో సంగీత దర్శకత్వం కెరీర్ ప్రారంభమైంది. మళ్లీ రెండేళ్ల గ్యాప్ తరువాత రామ్‌గోపాల వర్మతో ఐస్‌క్రీమ్-2చేశాను. తరువాత ఐరావతం, రావణలంక, సావిత్రి వైఫ్ ఆఫ్ సత్యమూర్తి, నాతో నేను అనే సినిమాలకు సంగీత దర్శకుడిగా పనిచేశాను. బాలీవుడ్‌లో చాలా సినిమాలు చేశాను. టైగర్ సుల్తాన్, షాదీ ఎక్స్‌ప్రెస్ సినిమాలకు పనిచేశాను. భారతీయన్స్, 1922 ప్రతీకారం సినిమాలు విడుదలకు సిద్ధంగా ఉన్నాయి.

> **సారే జహాసె అచ్చాకు కొత్త ట్యూన్..**
>
> 
>
> జనవరి 26న సారే జహాసె అచ్చా గీతానికి కొత్త ట్యూన్ కట్టాను. దానికి ఇండియా లెవల్‌లో పెద్ద అప్లాజ్ వచ్చింది. ఈ పాటను మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్ భార్య అమృత ఫడ్నవిస్ పాడారు. వరల్డ్ వైడ్ ట్రెండింగ్‌లో ఒక రోజంతా నిలిచింది. జనవరి 26న 1.30 కోట్ల వ్యూవర్‌షిప్ సాధించింది.

ఇటు సినిమాల్లో...అటు ఓటీటీ ఫిల్మ్‌లతో బిజీ..

సంగీత దర్శకుడిగా బిజీ అయ్యాను. టాలీవుడ్, బాలీవుడ్ సినిమాలకు సంగీతం అందిస్తున్నాను. అక్కడ 15 రోజులు, ఇక్కడ 15 రోజులు చేస్తున్నాను. ఇటీవల ఓటీటీ ఫిల్మ్స్‌గా అత్యంత ప్రజాదరణతో హాట్‌స్టార్‌లో ప్లే అయిన ఐరావతం, అమెజాన్ ప్రైమ్‌లో ప్లే అయిన రావణలంక సినిమాలకు కూడా సంగీతం అందించాను. ఇవి హయ్యస్ట్ ట్రెండింగ్ అయ్యాయి.

రెహమాన్ స్ఫూర్తి..

నాకు ఏఆర్ రెహమాన్ ఇన్‌స్పిరేషన్. ఆయన ట్యూన్లు, ఆయన పాటలు వింటూ పెరిగా. ప్రముఖ సంగీత దర్శకులు టీవీఎస్ రాజు, సాలూరు వాసూరావు తదితరుల వద్ద శిష్యరికం చేశాను.

ఆల్ టైమ్ రికార్డ్

- రథసప్తమి రోజున ఆదిత్యుని ఆదాయం రూ.48.65 లక్షలు
- గత ఏడాది కంటే రూ.17.02 లక్షలు అధికం



అరసవల్లి: రథసప్తమి మహోత్సవం సందర్భంగా అరసవల్లి శ్రీసూర్యనారాయణ స్వామి ఆలయానికి రికార్డు స్థాయిలో ఆదాయం సమకూరింది. 28వ తేదీన రథసప్తమి సందర్భంగా వివిధ రకాల దర్శనాల టిక్కెట్లు, వీఐపీ టిక్కెట్లు, ప్రసాదాల వితరణతో పాటు పలు ఆర్జిత సేవల ద్వారా గతంలో ఎన్నడూ లేనంతగా రూ.48,65,508 ఆదాయం లభించింది. ఇదే రథసప్తమికి 2021లో రూ.34,55,315, 2022లో రూ.31,63,202 ఆదాయం లభించింది. దీంతో ఇంత వరకు తాజాగా వచ్చిన ఆదాయమే అత్యధికంగా ఆలయ రికార్డుల్లోకెక్కింది. గత ఏడాదితో పోల్చితే 'సప్తమి' ఆదాయం రూ.17,02,306 అధికంగా వచ్చింది. ఆలయ ఈఓ వి.హరిసూర్యప్రకాష్ మంగళవారం తెలియజేసిన వివరాల మేరకు

- సప్తమి రోజున 1317 విశిష్ట దర్శనం (రూ.500)టిక్కెట్ల ద్వారా రూ.6,58,500.
- 7126 ప్రత్యేక ప్రవేశ దర్శనం (రూ.100) టిక్కెట్ల ద్వారా రూ.7,12,600
- 1707 క్షీరాభిషేకం (రూ500) టిక్కెట్ల ద్వారా రూ. 8,53,500
- ఈ ఏడాది ప్రవేశపెట్టిన వీఐపీ టిక్కెట్లు 2413 (రూ.500) ద్వారా రూ.12,06,500 మేరకు ఆదాయం లభించిందని వివరించారు.
- అలాగే 1260 కేశఖండన శాల టిక్కెట్ల (రూ.25) టిక్కెట్ల ద్వారా రూ.31500.
- 51816 లడ్డు (రూ.15) ప్రసాదం టిక్కెట్ల ద్వారా రూ.7,77,240
- 56810 పులిహోర ప్రసాదం (రూ.10) టిక్కెట్లు ద్వారా రూ.5,68,100 వరకు ఆదాయం లభించిందని, విరాళాల ద్వారా రూ.57,568 వచ్చినట్లుగా ఆలయ ఈఓ వివరించారు.

80 వేల మంది రాక

రథసప్తమికి వివిధ దర్శనాల టిక్కెట్ల ద్వారా కేవలం 18 వేల మంది ఆలయానికి నగదు చెల్లించి దర్శనం చేసుకున్నారు. అలాగే ఉచిత దర్శనానికి సుమారుగా 40 వేల మంది వరకు భక్తులు వచ్చినట్లు దర్శనానికి పట్టిన సమయాన్ని బట్టి తెలుస్తోంది. దీంతో పాటు వివిఐపి/విఐపిల మార్గం ద్వారా సుమారు 12 వేల మంది వరకు వచ్చినట్లు తెలుస్తోంది. అలాగే విధుల్లో ఉన్నవారు, ఇతర సేవల పేరిట వచ్చిన వారితో కలుపుకుని మొత్తంగా సుమారు 80 వేల మంది వరకు భక్తులు ఆదిత్యున్ని రథసప్తమి నాడు దర్శించుకున్నారని సమాచారం.

గురి తప్పకూడదు..

పోలీసు వృత్తిలో ఫైరింగ్ నైపుణ్యం కీలకమని ఎస్పీ జీఆర్ రాధిక అన్నారు. ఎచ్చెర్ల సమీపంలోని చిన రావుపల్లిలోని ఆర్మ్‌డ్ రిజర్వ్‌డ్ ఫైరింగ్ రేంజ్‌లో మంగళవారం వార్షిక ఫైరింగ్ సాధన కార్యక్రమం నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ ప్రతి అధునాతన ఆయుధం గురించి తెలుసుకోవాలని సూచించారు.

– ఎచ్చెర్ల క్యాంపస్



డీ ఫార్మశీలో మిగులు సీట్లకు దరఖాస్తులు

ఎచ్చెర్ల క్యాంపస్: శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో ఖాళీ డీ ఫార్మసీ సీట్ల స్పాట్ అడ్మిషన్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఆదిలక్ష్మి తెలిపారు. కళాశాలలో మంగళవారం వివరాలు వెల్లడించారు. రెండేళ్ల ఈ కోర్సుల్లో చేరేందుకు బైపీసీ, ఎంపీపీ పాసైన వారు అర్హులని తెలిపారు. ఫిబ్రవరి రెండో తేదీన 9 గంటల నుంచి స్పాట్ అడ్మిషన్లకు కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. విద్యార్థులు ఒరిజనల్ ధ్రువీకరణ పత్రాలు, రెండు సెట్లు జిరాక్సులతో హాజరు కావాలని అన్నారు. విద్యార్థులకు వసతి గృహం సదుపాయం కలిగిస్తామని, ప్రభుత్వ పథకాలు వర్తించవన్నారు.

ఆట ఆరంభం

ప్రారంభమైన సాక్షి ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నీ

- ముఖ్య అతిథిగా హాజరైన స్పీకర్ తమ్మినేని
- క్రీడాస్ఫూర్తితో ఆడాలని సూచన




సీనియర్స్ విభాగంలో వెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాల-బి టీమ్, గాయత్రి డిగ్రీ కళాశాల బి టీమ్ మధ్య జరుగుతున్న మ్యాచ్



సాక్షి ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభోత్సవ సభలో మాట్లాడుతున్న శాసనసభాపతి తమ్మినేని సీతారాం

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళంలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల మైదానం వేదికగా సాక్షి ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్ మంగళవారం ప్రారంభమైంది. సాక్షి మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న లీగ్ ప్రారంభోత్సవానికి స్పీకర్ తమ్మినేని సీతారాం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పోటీలను లాంఛనంగా ప్రారంభించిన స్పీకర్.. ఆట విడుపుగా కాసేపు బ్యాటింగ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజానికి మేలు చేసేందుకు నిరంతరం పాటుపడుతున్న 'సాక్షి' మీడియా చొరవ ప్రశంసనీయమని కొనియాడారు. క్రీడాకారులు జాతీయ పతాకంతో సమానమని అభిప్రాయపడ్డారు. క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించాలని పిలుపు నిచ్చారు. రాజకీయ నాయకులు కొన్ని ప్రాంతాలకే పరిమితం అవుతారని.. అయితే క్రీడాకారులు మాత్రం విశ్వవ్యాప్తంగా గుర్తింపును, గౌరవాన్ని పొందుతారని పేర్కొన్నారు. ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.సుందరరావు మాస్టారు మాట్లాడుతూ క్రీడల అభివృద్ధికి, క్రీడాకారుల ఎదుగుదలకు చేస్తున్న కృషి అభినందనీయమని కొనియాడారు. క్రికెట్‌తోపాటు మిగిలిన క్రీడాంశాలకు కూడా మున్ముందు ప్రాతినిధ్యం కల్పించాలని ఆయన కోరారు.



సరదాగా బ్యాటింగ్ చేస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

క్రీడాకారులకు 'సాక్షి' అండగా నిలుస్తుంది

పీడీ–పీఈటీల సంఘ జిల్లా అధ్యక్షుడు మొజ్జాడ వెంకటరమణ మాట్లాడుతూ జిల్లాలో క్రీడాకారులకు 'సాక్షి' మీడియా అండగా ఉంటోందన్నారు. సాక్షి బ్రాంచ్ మేనేజర్ బీజేజీవీఆర్ స్వామి మాట్లాడుతూ ఎస్‌పీఎల్ క్రికెట్ పోటీలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎంవీ సత్యన్నారాయణ, డీఎస్‌ఏ చీఫ్ కోచ్ ఎం.మాధురీలత, జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి బడి వెంకటరమణ, కళాశాల పీడీ ఎ.మోహన్‌రాజ్, కళాశాల ఎన్ఎస్ఎస్ అధికారి డాక్టర్ యాళ్ల పోలినాయుడు, పైడి వెంకటరమణ, మొదలవలస లీలామోహన్, రిఫరీ అన్నెపు ఆనంద్‌కుమార్, సాక్షి బ్యూరో ఇన్‌చార్జ్ కె.శివశంకర్, ఎడిషన్ ఇన్‌చార్జ్ కె.రాజా, యాడ్స్ మేనేజర్ బి.జగదీష్, ఇతర విభాగాల ప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు. వ్యాఖ్యాతగా డాక్టర్ ఎం.వాసుదేవ ఆచారి వ్యవహరించారు.

శ్రీ వెంకటేశ్వర కాలేజ్ బోణీ..

టోర్నీలో తొలిరోజు ఒక్క మ్యాచ్ మాత్రమే జరిగింది. గాయత్రి డిగ్రీ కళాశాల–బి(శ్రీకాకుళం రూరల్) జట్టుతో జరిగిన మ్యాచ్‌లో శ్రీ వెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాల–బి(ఎచ్చెర్ల) జట్టు 8 వికెట్లతో ఘన విజయం సాధించి బోణీ చేసింది. తొలుత టాస్ ఓడి బ్యాటింగ్ మొదలుపెట్టిన గాయత్రి కాలేజ్–బి జట్టు నిర్ణీత 8 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 51 పరుగులు చేసింది. ఆ జట్టులో మోనుసింగ్ 21 పరుగులు చేశాడు. వెంకటేశ్వర జట్టులో మణి 3 వికెట్లు పడగొట్టాడు. అనంతరం బరిలోకి దిగిన శ్రీ వెంకటేశ్వర కాలేజ్–బి జట్టు వెంకట్–19, సాయి 14 పరుగులతో రాణింపుతో 2 వికెట్లు కోల్పోయి జయభేరి మోగించింది.

ఎస్‌పీఎల్ నేటి మ్యాచ్‌లు ఇలా..

శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల మైదానం వేదికగా ఏ,బి రెండు గ్రౌండ్‌లలో మ్యాచ్‌లు జరగనున్నాయి. ఉదయం 8, 10, మధ్యాహ్నం 1 గంటకు మూడు మ్యాచ్‌లు జరగనున్నాయి.

ఏ–గ్రౌండ్‌లో:

1. శాంతినికేతన్ డిగ్రీ కాలేజ్ రణస్థలం – ఆదిత్య డిగ్రీ కాలేజ్–ఏ టీం శ్రీకాకుళం (ఉదయం 8 గంటలకు)
2. సాయి డెంటల్ కాలేజ్ శ్రీకాకుళం – శ్రీ వెంకటేశ్వర డిగ్రీ కాలేజ్ ఎచ్చెర్ల (ఉదయం 10 గంటలకు),
3. అంబేడ్కర్ యూనివర్సిటీ ఎచ్చెర్ల – సన్ డిగ్రీ కాలేజ్ శ్రీకాకుళం (మధ్యాహ్నం 1 గంట) మ్యాచ్‌లు జరగనున్నాయి.

బి–గ్రౌండ్‌లో:

1. ఆదిత్య పీజీ కాలేజ్–బి టీం శ్రీకాకుళం – శ్రీ వెంకటేశ్వర ఫార్మసీ కాలేజ్ ఎచ్చెర్ల (ఉదయం 8),
2. శ్రీ వెంకటేశ్వర ఇంజనీరింగ్ కాలేజ్–ఏ టీం ఎచ్చెర్ల – గాయత్రి డిగ్రీ కాలేజ్–ఏ టీమ్ శ్రీకాకుళం రూరల్ (ఉదయం 10),
3. ఆదిత్య ఇంజనీరింగ్ కాలేజ్–ఏ టీం టెక్కలి – గాయిత్రి పీజీ కాలేజ్ శ్రీకాకుళం రూరల్ (మధ్యాహ్నం 1).

క్లుప్తంగా

'న్యాయ సహాయం అందిస్తాం'

శ్రీకాకుళం పాతబస్టాండ్: ప్రజలకు న్యాయ సహాయం అందించేందుకే న్యాయసేవాధికార సంస్థ ఏర్పాటు చేశారని, ఈ కేసుల్లో న్యాయవాదులు పురోగతి సాధించాలని జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జ్ ఆర్.సన్యాసి నాయుడు పిలుపునిచ్చారు. ఆయన మంగళవారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ నియమించిన న్యాయవాదులతో సంబంధిత కేసులపై సమీక్షించారు. కేసుల పూర్వాపరాలు తెలుసుకుని పురోగతిని పరిశీలించారు. కార్యక్రమంలో మానిటరింగ్ కమిటీ మెంబర్ పాలిసెట్టి మల్లి బాబు జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ప్యానల్ న్యాయవాదులు న్యాయవాదులు కస్పా ప్రతాప్ చంద్ర ఏ.రమణారావు డి.ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అలుదులో చోరీ



కిటికీ ఊచలు విరిచిన దృశ్యం

సారవకోట: అలుదు గ్రామంలోని శిమ్మ భారమ్మ అనే మహిళ ఇంటిలో చోరీ జరిగింది. దొంగలు రూ.2 లక్షల విలువ గల సొత్తు దొంగిలించారని ఆమె మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు కిటికీ ఊచలు విరిచి ఇంటిలోకి జొరబడి ఇంటిలో ఉన్న రెండున్నర తులాల బంగారం, అర కిలో వెండి, రూ.30 వేలు వరకు నగదు చోరీ చేశారని ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు. సంఘటనా స్థలాన్ని పరిశీలించామని, కేసు నమోదు చేయలేదని ఎస్ఐ అప్పారావు తెలిపారు.

'గీతా సారం తెలుసుకోవాలి'



పూజలు అందుకుంటున్న గంగుదుర్యోధన స్వామి

నరసన్నపేట: అన్ని సమస్యలకు పరిష్కారమైన గీతా సారాంశాన్ని అర్థం చేసుకుని పాటించాలని శ్రీధర్ పీఠాధిపతి, ఉపన్యాసకర్త వడ్డివల్లి స్వామినాయుడు, సామంతుల మాధవరావు అన్నారు. కామేశ్వరిపేట పంచాయతీ పరిధి కొల్లవానిపేటలో భీష్మ ఏకాదశి పురస్కరించుకుని అద్వైత గజకేసరి గంగు దుర్యోధన స్వామి 58వ ఆరాధన సందర్భంగా పీఠంలో జరిగిన వేదాంత విచారణలో ఉపన్యసించారు. స్వామివారి సమాధి పూజ చేసి అనంతరం భక్తులకు ఉపదేశాలు ఇచ్చారు. పీఠం నిర్వాహకులు కొల్ల గోపి, బైరాగినాయుడు, బూర్లి లచ్చన్న, జిల్లా నలుమూలల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

ఆస్పత్రుల్లో డైట్ సరఫరాకు టెండర్లు

అరసవల్లి: ఆంధ్రప్రదేశ్ వైద్య విధాన పరిషత్ ఆధ్వర్యంలో జిల్లాలో గల సామాజిక ఆస్పత్రులు (12) ఏరియా ఆస్పత్రులు గల నరసన్నపేట, పాలకొండ, సీతంపేట, రాజాంలో గల రోగులకు, డ్యూటీ డాక్టర్లకు డైట్ సరఫరా కోసం టెండర్లు ఆహ్వానిస్తున్నారు. రెండేళ్ల కాల పరిమితితో సీల్డ్ టెండర్లను ఆస్పత్రుల వారీగా కోరుతున్నట్లు జిల్లా ఆస్పత్రుల సమన్వయాధికారి తెలిపారు. 8వ తేదీలోగా దరఖాస్తులు సమర్పించాలని కోరారు.

నెలవారీ నేర సమీక్ష సమావేశం

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లా పోలీస్ శాఖకు సంబంధించి నెలవారీ నేర సమీక్ష సమావేశం మంగళవారం సాయంత్రం జిల్లాపరిషత్ సమావేశ మందిరంలో విశాఖపట్నం రేంజి డీఐజీ ఎస్.హరికృష్ణ ఆధ్వర్యంలో ఎస్పీ జీఆర్ రాధిక అధ్యక్షతన జరిగింది. జిల్లాలో నేరాల నియంత్రణకు, ప్రమాదాల నివారణకు, మద్యం, గుట్కా, ఖైనీ, సారాయి, డ్రగ్స్ వంటి అక్రమ రవాణా కట్టడికి అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టాలన్న దానిపై డీఐజీ, ఎస్పీలు దిశానిర్దేశం చేశారు. సమావేశంలో ఎస్ఈబీ జేడీ వి.ఎస్.మణికంఠ, డీఎస్పీలు, ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	54,930–00
బంగారం(22సి. 10గ్రా.)	50,350–00
వెండి (కిలో)	74,500–00

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)	
విశాఖపట్నం	రూ. 547.00
విజయనగరం	రూ. 551.00
శ్రీకాకుళం	రూ. 551.00

చికెన్

బ్రాయిలర్		
లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹120	₹195	₹ 215

అనగనగా.. ఉద్దానం మునగ

- ఉద్దానం మునగకు మార్కెట్‌లో డిమాండ్
- జనవరి మొదటి వారంలో కిలో రూ.120లు
- ప్రస్తుతం రూ.50కు తగ్గిన ధర



పలాసలో మునగకాయలను విక్రయిస్తున్న రైతులు

పలాస: ఉద్దానం మునగకు డిమాండ్ పెరుగుతోంది. ఒకప్పుడు పెరటి పంటగా ఇది ఇంటి అవసరాల కోసం సాగు చేసేవారు. మునగ ఆకులు చారులోను, మునగ కాయలు కూడా చారులోను, విడిగా ఇతర కాయగూరల్లో కలపి వండుకొని తినేవారు. అయితే ఇప్పుడు వాణిజ్య పంటగా మునగ మారింది. పలాస మార్కెట్‌లో ఈ మునగ కాయలకు మంచి డిమాండ్ ఉంది. జనవరి మొదటి వారంలో కిలో మునగ కాయలు రూ.120 పలికాయి. ఇప్పుడు సీజన్ తగ్గడంతో పాటు కిలో మునగ కాయల ధర కూడా రూ. 50లకు పడిపోయింది.

పలాస, ఇచ్ఛాపురం నియోజకవర్గాల్లోని అన్ని మండలాల్లో సుమారు 20వేల హెక్టార్ల విస్తీర్ణంలో జీడి కొబ్బరి సాగవుతోంది. ఈ తోటల్లో రైతులు మునగ పంటను అంతర పంటగా పండిస్తూ లాభపడుతున్నారు. ఎక్కడ చిన్న ఖాళీ స్థలం కనిపించినా అక్కడ మునగ చెట్టు ఉంటుంది. ఏడాదికి మూడు సార్లు ఈ మునగ కాపునకు వస్తుంది. ఈ ఏడాది పలాస నియోజకవర్గంలోని పలాస, వజ్రపుకొత్తూరు, మందస మండలంలో జనవరి నెలలో విపరీతంగా మునగ కాపునకు వచ్చింది. పండగ ముందు రైతుకు కాసులు పంట కురిపించింది. ఇక్కడి నుంచి ఒడిశా, పశ్చిమబెంగాల్, ఉత్తరప్రదేశ్, బీహారు, తెలంగాణాతో పాటు ఆంధ్రప్రదేశ్‌లోని ముఖ్య పట్టణాలకు ఎగుమతి చేసినట్లు వ్యాపారి అచ్యుత పాత్రో చెప్పారు.



విరగ కాసిన మునగ చెట్టు

కిలో మునగాకు రూ.80



ఈ మునగాకుకు ఇతర పాశ్చాత్య దేశాల్లో బాగా డిమాండ్ ఉంది. కిలో మునగాకు ధర రూ.80లుగా ఉంది. మునగ విత్తనాలు కిలో రూ.500లుగా ఉన్నాయి. ఇది ఔషధాల నిధి. మునగ విత్తనాల్లో యాంటీ ఆక్సిడెంట్స్ ఉంటాయి. కాలేయాన్ని, మూత్ర పిండాలను శుభ్రం చేస్తుంది. పోషకాహారలోపాన్ని, సకల రోగాలను నివారించే ఔషధ గుణం ఉందని ఇప్పుడిప్పుడే తెలుస్తోంది. దీనికి ఇప్పుడు ప్రపంచ వ్యాప్తంగా డిమాండు ఉంది.

– శంకర్ దాస్, ఉద్యానవన శాఖాధికారి, పలాస

విరగ కాసింది



గతంలో ఎన్నడూ లేని విధంగా మునగ విరగ కాసింది. పండగ ముందు ఈ పంట చేతికి రావడం చాలా సంతోషం. ఒక్క మునగ చెట్టు ఉన్నోడు కూడా రెండు మూడు వేలకు కాయలను అమ్ముకున్నాడు. నాకు తక్కువ చెట్లే ఉన్నాయి. అయినా రూ.10వేలకు ఈ కాయలను అమ్మాను. మా చిన్నప్పుడు నుంచి మునగాకులను చారులోను, వేపుడు చేసికొని, అలాగే జినుగులు, పప్పులోను వేసుకొని తినేవాళ్లం.

– వంకల గురునాథం, రైతు, మామిడిపల్లి, పలాస మండలం

• నిద్దాలమ్మా.. కాపాడమ్మా





అమ్మవారిని ముర్రాటలతో దర్శించుకుంటున్న భక్తులు (ఇన్‌సెట్‌లో) అమ్మవారి నిజరూపం

జి సిగడాం: మండలం పరిధిలోని నిద్దాం గ్రామంలో వెలసిన నిద్దాలమ్మ తల్లి 16వ యాత్ర మహోత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఉదయం 6 గంటల నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు సమక్షంలో పూజలు చేశారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తుల కోసం ప్రత్యేక వసతులు ఏర్పాటు చేశామని నిర్వాహకులు తెలిపారు. బుధవారం రాత్రి 7 గంటలకు లక్ష దీపారాధన నిర్వహించనున్నట్లు తెలిపారు. తొలిరోజు భక్తులు అమ్మవారికి ముర్రాటలు సమర్పించారు.

వీధి బాలలు ఉండరాదు

- డీఎల్ఎస్ఏ కార్యదర్శి సన్యాసినాయుడు



అంతర్జాతీయ వీధి బాలల దినోత్సవం కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఎల్ఎస్ఏ కార్యదర్శి సన్యాసినాయుడు

శ్రీకాకుళం పాతబస్టాండ్: వీధి బాలలు ఉండరాదని, పిల్లలంతా బడిలోనే ఉండాలని తల్లిదండ్రులు లేని వారు బాల సదన్, ఇతర సంస్థల్లో నివాసం ఉండాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు అన్నారు. ఆయన మంగళవారం ఆయన సేవాసదన్‌లో అంతర్జాతీయ వీధి బాలల దినోత్సవం సందర్భంగా పోలీసులు, ఇతర అధికారులతో సమావేశం నిర్వహించారు. పరిసరాల్లో వీధి బాలలు కనిపించినా, పిల్లలు చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడుతూ కనిపించినా చైల్డ్ వెల్ఫేర్ కమిటీకి గానీ డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్‌కు గానీ సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న స్పెషల్ జువైనైల్ పోలీస్ యూనిట్, సచివాలయంలోని ఉమెన్ పోలీసు సిబ్బందితో న్యాయమూర్తి మాట్లాడారు. కన్స్యూమర్ ప్రొటెక్షన్ యాక్ట్‌పై న్యాయవాది బగాది రామ్మోహన్ రావు అవగాహన కల్పించారు. జువెలరీ జస్టిస్ యాక్ట్ పై స్థానిక ఎన్టీఆర్ లా కళాశాల ప్రిన్సిపల్ కె.మోషే అవగాహన కల్పించారు. కార్యక్రమంలో న్యాయవాదుల జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బెజ్జిపురం ఫల్గుణరావు, న్యాయకళాశాల విద్యార్థులు, పోలీస్ అధికారులు తదితరులు ఉన్నారు.

వందశాతం ఉత్తీర్ణత రావాలి: డీఈఓ



విద్యార్థులతో కలసి భోజనం చేస్తున్న డీఈఓ పగడాలమ్మ

నరసన్నపేట: ఈ విద్యా సంవత్సరంలో పదో తరగతి పరీక్షల్లో ఉత్తీర్ణత శాతం పెంచేందుకు విద్యాశాఖ ప్రతిష్టాత్మంగా తీసుకుందని డీఈఓ పగడాలమ్మ అన్నారు. ప్రతి స్కూల్‌లో వంద శాతం ఉత్తీర్ణత సాధనే లక్ష్యంగా ఉపాధ్యాయులు పనిచేయాలని సూచించారు. సత్యవరంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆమె మంగళవారం ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా పదో తరగతి విద్యార్థుల్లో ప్రమాణాలు పరిశీలించారు. పరీక్షలకు ఎలా విద్యార్థులను ఎలా సిద్ధం చేస్తున్నదీ తెలుసుకున్నారు. జిల్లా యూనిట్‌గా డాట్ పరీక్ష పేపర్లను అన్ని స్కూల్స్‌కు పంపుతున్నామని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఒకటో తరగతి విద్యార్థుల్లో ప్రమాణాలు బాగులేక పోవడాన్ని గుర్తించి ఉపాధ్యాయులకు సూచనలు చేశారు. అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. హెచ్ఎం జె.కృష్ణంరాజుతో పాటు ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు.

ప్రమాద బాధితులకు తక్షణ వైద్యం

- కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఆరోగ్య శ్రీ ద్వారా పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని కలెక్టర్, ఆరోగ్య శ్రీ అదనపు సీఈఓ శ్రీకేష్ బి.లాఠకర్ అన్నారు. ఆయన మంగళవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ఆరోగ్య శ్రీ పథకంపై ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల ప్రతినిధులతో జిల్లా క్రమశిక్షణ కమిటీలో సమీక్షించారు. ప్రమాదాల బాధితులకు తక్షణం వైద్యం చేయాలని సూచించారు. ఆస్పత్రిలో ఆరోగ్య పరీక్షల రేట్లను డిస్‌ప్లే చేయాలన్నారు. ఆరోగ్య శ్రీ ద్వారా వైద్యానికి వచ్చే పేషెంట్స్ వద్ద నగదు తీసుకోకుండా వైద్యం చేయాలన్నారు. ఒక వేళ నగదు తీసుకుంటే తిరిగి చెల్లించేటప్పుడు చెక్కులు లేదా ఫోన్ పే ద్వారా డిశ్చార్జ్ అవ్వకముందే చెల్లించాలని చెప్పారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఆరోగ్య శ్రీ వైద్యం సరిగా జరగడం లేదని, డీసీహెచ్ దీనిపై దృష్టి సారించాలని ఆదేశించారు. ప్రతి నెల వర్చువల్ ద్వారానైనా సమావేశం నిర్వహించాలన్నారు. రాష్ట్ర స్థాయిలో గత 3 నెలలుగా ఆరోగ్య శ్రీ లో ఎన్నో స్థానంలో ఉందని అడగ్గా, 13వ స్థానంలో ఉన్నట్లు ఆరోగ్య శ్రీ జిల్లా కోఆర్డినేటర్ కలెక్టర్‌కు వివరించారు. జెమ్స్ ఆస్పత్రిలో 5700 ఆరోగ్య శ్రీ కేసులు చూశారని చెప్పగా యాజమాన్యాన్ని అభినందించారు. జాతీయ రహదారిపై ప్రమాదాలు జరిగితే టెలిఫోనిక్ ఇంటిమేషన్ ద్వారా ఎలాంటి గుర్తింపు కార్డు లేకపోయినా చికిత్స చేయాలన్నారు. ఆరోగ్య శ్రీ జిల్లా కో ఆర్డినేటర్ డాక్టర్ పి.ప్రకాశరావు ఆరోగ్య శ్రీ పై వివరించారు.

విద్యుత్ షాక్‌తో తాపీమేస్త్రీ మృతి



పలాస ప్రభుత్వ ఆస్పత్రిలో మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ శివాజీనగర్‌లో మంగళవారం ఉదయం విద్యుత్ షాక్ కొట్టి హనుమంతు కృష్ణారావు(52) అనే తాపీమేస్త్రీ మృతి చెందారు. వజ్రపుకొత్తూరు మండలం మహాదేవపురం గ్రామానికి చెందిన కృష్ణారావు(52) శివాజీ నగర్‌లో పనులు చేస్తున్నారు.

పొడవైన ఇనుపరాడ్డును మేడపై తిప్పే క్రమంలో అది విద్యుత్ తీగలకు తాకడంతో షాక్ కొట్టి అక్కడికక్కడే చనిపోయాడని పోలీసులు తెలిపారు. కాశీబుగ్గ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య మహాలక్ష్మి, ముగ్గురు పిల్లలు ఉన్నారు.

ఉగాది నాటికి గృహ ప్రవేశాలు



టెక్కలి జగతిమెట్ట వద్ద వైఎస్సార్ జగనన్న కాలనీలో ఇంటి నిర్మాణాలు పరిశీలిస్తున్న గృహ నిర్మాణ శాఖ జేఎండీ శివప్రసాద్

టెక్కలి: వైఎస్సార్ జగనన్న కాలనీల్లో ఉగాది నాటికి గృహ ప్రవేశాలకు ఇంటి నిర్మాణాలు పూర్తి చేయాలని గృహ నిర్మాణ శాఖ జేఎండీ శివప్రసాద్ అన్నారు. మంగళవారం టెక్కలి సమీపంలో జగతిమెట్ట వద్ద వైఎస్సార్ జగనన్న కాలనీలో ఇంటి నిర్మాణాలను ఆయన పరిశీలించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉగాది నాటికి 5 లక్షల ఇళ్లు పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేశారని పేర్కొన్నారు. జిల్లాలో 32,893 ఇళ్లు పూర్తి చేయాలని లక్ష్యం నిర్దేశించారని, ఇప్పటి వరకు 17,393 ఇళ్లు పూర్తి చేసినట్లు వెల్లడించారు.

మిగిలిన ఇళ్లు త్వరితగతిన పూర్తి చేయాలని జేఎండీ శివప్రసాద్ ఆదేశించారు. ఆయనతో పాటు పీడీ ఎస్.గణపతిరావు, ఈఈ పి.వి.జోగారావు, డీఈ సుజాత, ఏఈ సంగమేశ్వరరావు, ఇంజినీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీకాకుళంలో..

శ్రీకాకుళం రూరల్: రాగోలులోని అర్బన్ లేఅవుట్‌ను జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ శివప్రసాద్‌పరిశీలించారు. శ్లాబ్ వేసిన 117 ఇళ్లను ఫిబ్రవరి 15 కల్లా పూర్తి చేయాలన్నారు. మిగిలిన వాటిని ఉగాది నాటికి పూర్తి చేయాలన్నారు. ఈయనతో పాటు పీడీ గణపతి, ఈఈ మోహన్, డీఈ నాగేశ్వరరావు, ఏఈ గణేష్ ఉన్నారు.

అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యం పట్టివేత



ఆర్టీసీ కార్గో బస్సులో పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్న అధికారులు

శ్రీకాకుళం రూరల్: మండల పరిధిలోని రాగోలు పరిసర ప్రాంతంలో సోమవారం రాత్రి ఆర్టీసీ కార్గో బస్సులో అక్రమంగా 11,400 కిలోల పీడీఎస్ బియ్యాన్ని తరలిస్తుండగా.. ప్రాంతీయ నిఘా అమలు అధికారి ఎ.సురేష్‌బాబు ఇచ్చిన సమాచారం మేరకు విజిలెన్స్, రెవెన్యూ అధికారులు దాడి చేసి పట్టుకున్నారు. ఈ దాడుల్లో రూ.4,63,600 విలువ చేసే పీడీ ఎస్ బియ్యంతో పాటు 1600 కిలోల నూకలు పట్టుకున్నారు. ఈ బియ్యం తరలింపులో ఎల్ఎన్‌పేటకు చెందిన శివకుమార్, లాడి శ్రీకృష్ణ, అనే వ్యక్తులు కీలకంగా వ్యవహరించారని, ఎవరికీ అనుమానం రాకుండా ఉండేందుకు ఆర్టీసీ కార్గో బస్సులో తరలించినట్లు విజిలెన్స్, రెవెన్యూ అధికారులు తెలిపారు. దాడిలో విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్లు అప్పలనాయుడు, ఎస్ఐ రామారావు, శ్రీకాకుళం మండల పౌరసరఫరాల అధికారి షరీఫ్ ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

టెక్కలి రూరల్: మండలంలోని దమర గ్రామ సమీప రహదారిపై మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. బందపల్లి గ్రామానికి చెందిన సవర గణేష్, సవర రామకృష్ణ బైక్‌పై టెక్కలి వచ్చి తిరిగి వెళ్తుండగా దమర గ్రామం వద్ద అడవి పంది అడ్డు రావడంతో బండి అదుపు తప్పింది. దీంతో ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108 సాయంతో వీరిని టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు.

జగనన్న మహిళా మార్ట్ ప్రారంభం రేపు

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ) : శ్రీకాకుళం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఇలిసిపురం కూడలిలో జగనన్న మహిళా మార్ట్‌ను గురువారం ప్రారంభించనున్నారు. రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు, ఏపీ మెప్మా మిషన్ డైరెక్టర్(గుంటూరు) వి.విజయలక్ష్మిలు ఈ మార్టును ప్రారంభించనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ మేరకు శ్రీకాకుళం మున్సిపల్ కమిషనర్ సీహెచ్ ఓబులేషు, జిల్లా మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ ఎం.కిరణ్‌కుమార్ మంగళవారం పత్రికాప్రకటన విడుదల చేశారు. మున్సిపాలిటీలో గల మెప్మా సిబ్బంది, టి.ఎల్.ఎఫ్ స్వయం సహాయక సంఘాల సభ్యులు కార్యక్రమానికి హాజరుకావాలని కోరారు.

రూ.10.06 లక్షలకు జీడి మొక్కల వేలం

అరసవల్లి: స్థానిక అటవీ శాఖాధికారి కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన జీడి తోటల వేలంలో కేవలం 5 యూనిట్లకు గాను రూ.10.06 లక్షలకు వేలం ఖరారైంది. జిల్లా అటవీశాఖాధికారి నిషాకుమారి, స్క్వాడ్ డీఎఫ్ఓ సోమసుందరం ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. జిల్లా వ్యాప్తంగా ఉన్న నాలుగు రేంజ్‌ల పరిధిలోని 28 యూనిట్ల జీడితోటలకు నిర్వహించిన వేలం ప్రక్రియలో శ్రీకాకుళం రేంజ్ పరిధిలో 3 యూనిట్లు, కాశీబుగ్గ రేంజ్ పరిధిలోని 2 యూనిట్లకు మాత్రమే వేలం సజావుగా జరిగింది. వివిధ కారణాలతో మిగిలిన 25 యూనిట్లకు వేలం జరగలేదు. పాతపట్నం రేంజ్ పరిధిలో 5 యూనిట్లు, టెక్కలి రేంజ్‌లో 9, కాశీబుగ్గ రేంజ్ పరిధిలో 2 , శ్రీకాకుళం రేంజ్ పరిధిలో 7 యూనిట్లలో వచ్చే నెల 13న మళ్లీ వేలం ప్రక్రియ నిర్వహిస్తామని జిల్లా అటవీ శాఖాధికారి నిషాకుమారి తెలియజేశారు. కార్యక్రమంలో సబ్ డీఎఫ్ఓ హారిక, శ్రీకాకుళం రేంజర్ జగదీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అచ్చెన్నాయుడు కిరాతకుడు

- ధ్వజమెత్తిన ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్

టెక్కలి: టెక్కలి నియోజకవర్గంలో ఫెర్రో అల్లాయిస్ యాజమాన్యంతో కుమ్మక్కై 300 మంది కార్మికుల కుటుంబాలను రోడ్డున పడేసిన కింజరాపు అచ్చెన్నాయుడు అభివృద్ధి కోసం మాట్లాడడం హాస్యాస్పదమని ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ అన్నారు. ఆయన టెక్కలిలో మంగళవారం మీడియాతో మాట్లాడారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలన కోసం మాట్లాడే కనీస అర్హత అచ్చెన్నాయుడికి లేదన్నారు. పవర్‌ప్లాంట్‌లో ఉద్యోగాలు ఇస్తామని చెప్పి 10 వేల మంది నిరుద్యోగులను మోసం చేసిన ఘనుడు అచ్చెన్నాయుడు అని ధ్వజమెత్తారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఒక్క టెక్కలి నియోజకవర్గంలో 5 వేల మందికి ఉద్యోగాలు కల్పించామన్నారు. టీడీపీ హయాంలో ఒక్కరికైనా ఉద్యోగం ఇచ్చారా అని ప్రశ్నించారు. మంత్రి హోదాలో జిల్లాకు ఒక్క శాశ్వతమైన పథకం తీసుకువచ్చారా అని అచ్చెన్నను సూటిగా ప్రశ్నించారు. పదవి కోసం సొంత సోదరుడినే హత్య చేసిన కిరాతకుడు అచ్చెన్నాయుడు అని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ప్రజల ముంగిటకు వెళితే తరిమికొడతారనే భయం అచ్చెన్నాయుడుకు ఉందన్నారు. గత ప్రభుత్వ పాలనలో ఆదరణ పథకం, బీసీ కార్పొరేషన్ రుణాల్లో ఎంత మేరకు కమీషన్ల ద్వారా దండుకున్నారో తమ దగ్గర లెక్కలు ఉన్నాయని దువ్వాడ పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమాలను ఆధారాలతో సహా చెప్పడానికి తాము సిద్ధంగా ఉన్నామన్నారు. సొంత పార్టీపైనే అనుచిత వ్యాఖ్యలు చేసిన అచ్చెన్న రానున్న ఎన్నికల్లో నామినేషన్ వేయడానికి కూడా అనర్హుడని దువ్వాడ అన్నారు.

చిరుధాన్యాల సాగుతో బాగు



పొలం బడి కార్యక్రమంలో పాల్గొన్న వ్యవసాయ శాఖాధికారులు

హిరమండలం: చిరుధాన్యాల సాగు రైతులకు మేలు చేస్తుందని వైఎస్సార్ పొలంబడి రాష్ట్ర పరిశీలకులు డి.ప్రవీణ్, ఆత్మా పీడీ కె.కృష్ణారావు అన్నారు. మండలంలోని అక్కరాపల్లి పంచాయతీ సీది గ్రామంలో చిరుధాన్యాల సాగుపై నిర్వహించిన అవగాహన సదస్సులో వీరు పాల్గొన్నారు. గతంలో చాలా ఇళ్లల్లో రాగిముద్ద, కొర్ర అన్నం, జొన్న రొట్టెలు, చిరుధాన్యాల ఆహార పదార్థాలు తినేవారని, అందుకే అప్పట్లో జీవన ప్రమాణాలు ఎక్కువగా ఉండేవని తెలిపారు. చిరు ధాన్యాల సాగు తగ్గాక ఆయుఃప్రమాణాలు కూడా తగ్గిపోయాయన్నారు. రాగులు, సామలు, కొర్రలు, సజ్జలు, జొన్నలు వంటి చిరుధాన్యాలు పండించాలన్నారు. దీనికి ప్రభుత్వం కూడా సహకరిస్తోందని చెప్పారు. అనంతరం వ్యవసాధికారులు చిరుధాన్యాల సాగు, విత్తన శుద్ధి, విత్తన మోతాదు, ఎరువుల వాడకం, కలుపు నివారణ, నీటియాజమాన్యం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. సీదిలో రాగి సాగు చేస్తున్న పొలంలో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు.

కార్యక్రమంలో వ్యవసాయశాఖ ఏడీఏలు సీహెచ్ వెంకట్రావు, రాజగోపాల్, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ గొర్లె నాగేశ్వరరావు, స్థానిక సర్పంచ్ రామారావు, ఎంపీటీసీ సావిత్రి తదితరులు పాల్గొన్నారు.